465) ధన్యాసి

ప॥ అటుగాన మోసపోక హరి నీకే అన్నియును। ఘటియించుటే యెక్కుడు గమలారమణ॥

చ॥ నిన్ను జూడనికన్నులు నీచువలకన్నులు। చిన్నినీకథవిననిచెవులు రాట్నపుజెవులు।
వున్నతి నీకడకు రాకున్న కాళ్ళు మరగాళ్ళు। సన్నుతిసేయనిజిహ్వ సరి నుపజిహ్వ॥

చ॥ చేరి నిన్ను బూజించనిచేయి దంతెనపుజేయి। తారి నీకు మొక్కనట్టితలయే పెడతల।
సారె నీముద్రలేనిభుజములు బుద్బుజములు। తేరి నీదాస్యములేనిదేహము సందేహము॥

చ॥ వనమాలలున్నగ్రీవము కంబుగ్రీవము। ఘనమిది దెలియుటే కైవల్యము।
యెనయు శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి। అనుమానమెల్ల బాసె నన్నిటా నాకును॥